క్లుప్తంగా

లోక్ అదాలత్‌లో 370 కేసులు పరిష్కారం

బోథ్: బోథ్ జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో శనివారం లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 370 కేసులు పరిష్కారమైనట్లు జడ్జి మౌనిక తెలిపారు. రాజీ పడటం ద్వారా 25 కేసులు, ఎక్సైజ్ 15, సీసీ 31, ఎస్‌టీసీ 299 కేసులు పరిష్కారమైనట్లు పేర్కొన్నారు. బ్యాంకు అదాలత్ ద్వారా 4 కేసులు పరిష్కరం అయ్యాయి. రూ. 5,77,000 రికవరీ అయినట్లు తెలిపారు. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీపీ శ్రీధర్, ఏజీపీ పంద్రం శంకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్ రావ్ దేశ్‌పాండే, అంగద్ కేంద్రే, మోహన్‌రావు, రూపేందర్ సింగ్, ఆడెపు హరీశ్, కుమ్మరి విజయ్, జమీర్, ధమ్మపాల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

10న బోథ్ వీడీసీ ఎన్నిక

బోథ్: ఈనెల 10న బోథ్ గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక నిర్వహించనున్నట్లు వీడీసీ ఎన్నిక అడ్‌హక్ కమిటీ సభ్యులు తెలిపారు. మండల కేంద్రంలోని షాదీఖానాలో ఉదయం 10 గంటలకు ఎన్నిక ప్రారంభమవుతుందన్నారు. ప్రతీ కులం నుంచి ఇద్దరు సభ్యులు హాజరు కావాలని కోరారు.

మహిళలు పురుషులతో సమానంగా రాణించాలి

ఉట్నూర్‌రూరల్: మహిళలు పురుషులతో సమానంగా రాణించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని లక్కారం గ్రామపంచాయితీ పరిధిలోని రాంజీగోండ్ భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వెడ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సకల జగతికి ప్రాణం పోసే మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ దాక పురుషులతో సమానంగా మహిళలు నేటి తరంలో అన్నిరంగాల్లో రాణిస్తున్నారని, ఒక స్త్రీ తలచుకుంటే సాధించలేనిది ఏది ఉండదన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు కాపాడే బాధ్యత ప్రతీ మహిళలపై ఉందన్నారు. అనంతరం డాక్టర్లకు, అంగన్‌వాడీలను, ఆశవర్కర్లను, వెడ్మ ఫౌండేషన్ తరుపున శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందచేశారు. కార్యక్రమంలో నాయకులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి



భోజన కార్యక్రమం ప్రారంభిస్తున్న జడ్జి

ఖానాపూర్: ప్రతిఒక్కరూ సేవాదృక్పథం అలవర్చుకుని సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని ఖానాపూర్ కోర్టు జడ్జి జితిన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. అక్కడికి వచ్చిన కక్షిదారులకు వేంకటేశ్వర రైస్‌మిల్ యజమాని కిషన్‌రెడ్డి భోజన సదుపాయం కల్పించారు. ఈసందర్భంగా సేవ కార్యక్రమాలు చేపడుతున్న కిషన్‌రెడ్డిని జడ్జి అభినందించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మంత్రరాజ్యం సురేశ్, వెంకట్ మహేంద్ర, కిశోర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

భయాందోళనకు గురిచేయొద్దు



మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: పట్టణ వాసులను మున్సిపల్ అధికారులు.. పన్నుల పేరిట భయాందోళనకు గురిచేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆకుల శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ అంకం మహేందర్ అన్నారు. పట్టణంలోని విశ్రాంతిభవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్, సిబ్బంది పట్టణంలోని స్థిరాస్థిదారులకు పన్నుల వసూళ్లపై నోటీసులు ఇవ్వకుండా ఇళ్లను, దుకాణాలను సీజ్ చేయడం సరికాదన్నారు. ప్రజల ఇళ్ల ఎదుట చెత్తబండ్లతో సిబ్బందితో వెళ్లి దౌర్జన్యంగా పన్నులు వసూలు చేస్తున్నారని అన్నారు. మరోవైపు కోతులు, కుక్కల బెడదతో ప్రజలు రోడ్డు మీద తిరగని పరిస్థితి ఉందని.. సదరు సమస్యలను పరిష్కరించకుండా ఉన్నతాధికారుల మెప్పు కోసం మాత్రమే పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

కడెం: మండలంలోని ఉడుంపూర్ పంచాయతీపరిధిలోని మిద్దెచింత గ్రామంలో శనివారం ఈవా ఫౌండేషన్, దస్తురాబాద్ పీహెచ్‌సీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి స్పందన లభించింది. 112 మంది గ్రామస్తులను పరీక్షించి.. జ్వరం, ఇతర జబ్బులతో బాధపడుతున్న 15 మందికి రక్త పరీక్షలు చేసి మందులు అందించారు. ఇందులో డాక్టర్ విజయ్‌కుమార్, ఈవా ఫౌండేషన్ చైర్మన్ కొమ్ము విజయ్, శైలేంద్ర, కన్నయ్య, లలిత, సంతోష్, సిబ్బంది తదితరులున్నారు.



ఆదిలాబాద్: మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య



ఇంద్రవెల్లి: మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం



ఇచ్చోడ: మహిళలను సన్మానిస్తున్న వీడీసీ సభ్యులు

ఘనంగా మహిళా దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మహిళలు కేక్ కట్ చేశారు. పలు గ్రామాల్లో మహిళలకు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. జైనథ్ మండలంలోని అడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే సతీమణి పాయల్ ఉమా కేక్ కట్‌చేసి చేశారు. ఆర్టీసీ డిపోలో మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు తమ హక్కులను సాధించుకునేందుకు ఉద్యమించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య అన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



ఎమ్మెల్సీ సతీమణికి కేక్ తినిపిస్తున్న టీచర్స్



బోథ్: మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



సన్మాన గ్రహీతలతో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర అధికారులు



ఆదిలాబాద్‌టౌన్: టీచర్‌ను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

నార్నూర్: ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఈనెల 16న ఉంటుందని దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 7నుంచి హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలని మండల కేంద్రంలోని ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు శనివారం తెలిపారు. ఉట్నూర్ ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాల పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోవాలన్నారు.

అంతర్జాతీయ కథల పోటీలకు విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): అంతర్జాతీయ కథా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించే ఆన్‌లైన్ కథల పోటీలకు జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కెనడాకు చెందిన తెలుగు తల్లి కెనడా, గడుగ్గాయ్, మార్నింగ్ రాగా సంస్థలు ఊ కొడతారా ... బుజ్జాయిల కథలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. కెనడా, అమెరికా, అబుదాబి, మలేషియా, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇండియా దేశాలకు చెందిన 150 మంది విద్యార్థులు జూమ్ ద్వారా పది గంటల పాటు నిర్విరామంగా కథలు చెప్పనున్నారు. ఇందులో లక్ష్మీపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తాము స్వయంగా రాసిన కథలు చెప్పనున్నట్లు ప్రధానోపాధ్యాయులు పోరెడ్డి అశోక్ తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం వీడీసీ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీడీసీ సభ్యులు మాట్లాడుతూ.. వేసవిలో దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు పెరమల్ల నారాయణ, ఉపాధ్యక్షుడు జలైజాకు, సురేశ్, అన్నెల లక్ష్మణ్, లోక శిరీష్‌రెడ్డి, మౌనిక రాథోడ్, పిల్లి నరేశ్, కొల్లురి శేఖర్, భూమయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ డీడీ వసంత రావు



ప్యాడ్లు పంపిణీ చేస్తున్న సొసైటీ నిర్వాహకులు

నార్నూర్: విద్యార్థులు పాఠశాలస్థాయిలో ఉన్నత లక్ష్యంతో చదివితే బంగారు భవిష్యత్ ఉంటుందని ఐటీడీఏ డీడీ వసంతరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవం, మహిళల దినోత్సవాన్ని నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని తల్లిదండ్రులకు ఇటు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్య భవిష్యత్‌లో మంచి స్థాయిలో ఎదగడానికి దోహదపడుతుందన్నారు. వచ్చే పదవ తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించేలా సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో ఏటీడీవో క్రాంతికుమార్, ఐటీడీఏ సీనియర్ అసిస్టెంట్ వేణు, ప్రధానోపాధ్యాయులు జాదవ్ విఠల్, పీడీ విశ్వనాథ్, వార్డెన్ వనిత, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

ఇంద్రవెల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని రత్న సాన్వి వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు సత్యారాజ్ ఉపారి అన్నారు. శనివారం మండలంలోని దనోరా(బి) జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గంగయ్య, సొసైటీ సభ్యులు అతీష్‌కుమార్, శ్రీరంగ్, కాత్లే పృధ్విరాజ్, సోయం సతీష్, మురళి పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

ఇంద్రవెల్లి: ఉపాధి కూలీల సంఖ్యను పెంచి గ్రామీణ ప్రాంత రైతులకు ఉపాధి కల్పించాలని డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్ అన్నారు. శనివారం మండలంలోని కేస్లాపూర్, ఇన్కార్‌గూడ గ్రామాల వ్యవసాయ భూముల్లో కొనసాగుతున్న ఉపాధి పనులు, క్యాటిల్ షెడ్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈజీఎస్ అధికారులతో మాట్లాడి కొనసాగుతున్న పనులు, పని చేస్తున్న కూలీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కూలీల సంఖ్యను పెంచి రైతులకు, కూలీలకు ఉపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో జాదవ్ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్‌లు గణేష్, సంతోష్ జైస్వాల్, ధమ్మనంద్, తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని సెంట్ జోసఫ్ కాన్వెంట్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. విద్యార్థులు తయారు చేసిన తినుబండారాలను ప్రదర్శించారు. వివిధ రకా ల పుస్తకాలతో పాటు రైలుబండి, జంపింగ్ జపాన్, మిక్కీమౌస్ వంటి వాటిని ప్రదర్శనలో ఉంచారు. అలాగే విద్యార్థులు డీజే పాటలకు చేసిన నృత్యం ఆకట్టుకుంది. ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ రోస్ వంటకాలను రుచి చూసి చూశారు.



తినుబండారాలను విక్రయిస్తున్న విద్యార్థులు

ఎండుతున్న పంటలు



బోథ్ మండలంలో భూగర్భజలాలు అడుగంటుకుపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. బోర్లలో నీరు లేకపోవడంతో పంటలకు నీరు అందే పరిస్థితి కనబడటం లేదు. దీంతో రైతుల కళ్లముందే పంటలు ఎండిపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. – బోథ్

ఎంఈవో కార్యాలయం ప్రారంభం



ప్రారంభిస్తున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌రూరల్: మావల ఎంఈవో నూతన కార్యాలయాన్ని డీఈవో ప్రణీత శనివారం మావల మండల కేంద్రంలో ప్రారంభించారు. మండలంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మావల మండల ప్రత్యేకాధికారి రాజలింగు, ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ వేణు గోపాల్, సెక్టోరల్ అధికారి నారాయణ, బోరంచు శ్రీకాంత్ రెడ్డి, రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గోవుల అక్రమ రవాణాను ఆపండి'



ఎస్సైకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బోథ్: బోథ్ మండలంలో గోవుల అక్రమ రవాణాను అరికట్టాలని హిందూ సంఘాలు శనివారం బోథ్ ఎస్సై ప్రవీణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గోవులను అక్రమంగా తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా గోవులు తరలించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో బోథ్, సొనాల మండలాలకు చెందిన గోరక్షక్, హిందూ వాహిని, భజరంగ్ దళ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాజీరావు సప్తాహం

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): భోరజ్ మండలంలోని మాండగడ గ్రామంలో ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా సప్తహ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. చిన్నపిల్లలతో దేవత వేషధారణ వేయించి వారిని ఎడ్ల బండిపై కూర్చోబెట్టుకొని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో బాజీరావు బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా అన్నదాన చేపట్టారు.

'మహిళ లేకుండా వ్యవస్థ లేదు'

ఆదిలాబాద్‌రూరల్: మహిళ లేకుండా వ్యవస్థ లేదని పలువురు మహిళలు అన్నారు. శనివారం మావల మండలంలోని కుమురం భీం గూడలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఆధ్వర్యంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మహిళా వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు ఎమ్మెల్సీ కోదండరాం కార్యక్రమానికి రాలేకపోయానని చెబుతూ మహిళలకు ఫోన్ ద్వారా మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మ్యూజిషియన్ రాజు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఆదిలాబాద్‌లో ఆదివాసీ మహిళలు జరుపుకోవడం సంతోషకరమన్నారు. 365 రోజుల్లో ఒక్క రోజు మహిళల కోసం ఐక్య రాజ్య సమితి కేటాయించిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సహాసిని రెడ్డి, కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, సాయి మౌనారెడ్డి, గోడం రేణుక, ఉయిక ఇందిరా, సోయం లలిత, బోరంచు శ్రీకాంత్ రెడ్డి, సాజిద్ ఖాన్, గోడం గణేష్ పాల్గొన్నారు.



మహిళా వీరులకు నివాళులర్పిస్తున్న మహిళలు

అలరించిన సైన్స్ ఎగ్జిబిషన్



సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌రూరల్: సీవీ రామన్ జయంతి సందర్భంగా మావల మండలంలోని ఎస్ఆర్‌ప్రైమ్ పాఠశాలలో శనివారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను డీఈవో ప్రణీత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళల గొప్పతనాన్ని వారికి చూపించాల్సిన గౌరవాన్ని విద్యార్థులకు తెలియజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సరోజ, డీఎస్‌వో రఘు రమణ, జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

16న విగ్రహావిష్కరణ

ఇచ్చోడ: ఈనెల 16న మండల కేంద్రంలో గౌతమ బుద్ధుడి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట పోస్టర్ ఆవిష్కరించారు. జామిడిలో ఉన్న బుద్ధ విహార్ నుంచి బుద్ధుడి విగ్రహంతో మండల కేంద్రంలోని బుద్ధవిహార్ వరకు శాంతియాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు విగ్రహాప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందన్నారు. అంబేడ్కర్ మనువడు, బుద్ధిస్ట్ ఆల్ సొసైటీ ఆల్ ఇండియా అధ్యక్షుడు భీంరావు యశ్వంత్‌రావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ వాదులు, అభిమానులు, పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సోన్‌కాంబ్లే కృష్ణాకుమార్, నర్వడే రమేశ్, ధమ్మపాల్, కాంబ్లే గణేష్, హేమన్‌రావు, పాముల నారాయణ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మహిళా ఉపాధి కూలీలకు సన్మానం

సిరికొండ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని పోచంపల్లి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ కూలీలు మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వంద రోజుల పని పూర్తి చేసుకున్న మహిళా కూలీలను పని ప్రదేశంలో ఉపాధి పీల్డ్ అసిస్టెంట్ ఆనంద్ రావు వారిని శాలువాతో సన్మానించాడు. మహిళా కూలీలచే కేక్‌కట్ చేయించి మహిళా దినోత్సవాన్ని జరుపుకొన్నారు.



కేక్‌కట్ చేస్తున్న ఉపాధి కూలీలు